క్లుప్తంగా

గడప గడపకు జగనన్న పథకాలు



పథకాల గురించి వివరిస్తున్న నరసింహారెడ్డి

అద్దంకి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు అందించిన జగనన్న పథకాలను గడప గడపకు తెలియజేసే కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల నాయకుడు నరసింహారెడ్డి చేపట్టారు. గురువారం ఆయన పట్టణంలోని బలిజపాలెం, రాములవారి గుడితోపాటు వివిధ వీధుల్లో గడప గడపకు తిరిగారు. ప్రజలతో మమేకం అవుతూ వారితో ముచ్చటిస్తూ జగనన్న పథకాలను ఏ విధంగా అందించాడో వివరించుకుంటూ వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జి, వార్డు ఇన్‌చార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదరం క్యాంపునకు పోటెత్తిన రోగులు



అధిక సంఖ్యలో హాజరైన రోగులు

చీరాల రూరల్: స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో గురువారం ఏర్పాటు చేసిన సదరం క్యాంప్‌కు వివిధ ప్రాంతాల నుంచి రోగులు పోటెత్తారు. కళ్లు, ఎముకలకు సంబంధించిన క్యాంపులు ఆస్పత్రిలో ప్రతి సోమవారం, గురువారం క్రమం తప్పకుండా క్యాంపులు నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కంటి, ఎముకలకు సంబంధించి అంగవైకల్యం, పుట్టుకతోనే పక్షవాతానికి గురై కాళ్లు చేతులు పడిపోవడం వంటి సమస్యలను వైద్యులు గుర్తిస్తారు. ఆయా వ్యాధులకు పర్సంటేజిని బట్టి మెడికల్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తారు.

అద్దంకి బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా హజరత్తయ్య

అద్దంకి రూరల్: అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో గురువారం జరిగిన అద్దంకి బార్ కౌన్సిల్ అసోషియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడుగా హజరత్తయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా శానం నాగేశ్వరరావు, సెక్రటరీ జబ్బార్, జాయింట్ సెక్రటరీ ఏ.యం సత్యవతి, ట్రెజరర్‌గా హరిబాబు, మహిళా ప్రతినిధి కుసుమలత ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీగా న్యాయవాదులు అభినందనలు తెలిపారు.


విద్యార్థుల్లో నైపుణ్య విలువలు పెరగాలి



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చీరాల అర్బన్: విద్యార్థులలో నైపుణ్య విలువలు పెరగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పాపరాజుతోటలోని రాఘవేంద్ర ఇంగ్లిషు మీడియం స్కూల్ 15వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పవని భానుచంద్రమూర్తి, పొట్లూరి ఉమామహేశ్వరరావు, నక్కా శ్రీనివాసరావు, సుజాత వెంకటనారాయణలు హాజరయ్యారు. విద్యార్థులు చదువులో రాణించాలంటే మంచి క్రమశిక్షణ అవసరమన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మణికుమార్, సుజాత వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఫోన్ల అందజేత



అద్దంకి రూరల్: గత 15 రోజుల క్రితం ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సీఐ పీ కృష్ణయ్య రికవరీ చేయించి ఫోన్‌లను అందజేశారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. అద్దంకికి చెందిన సీహెచ్ శ్రీనివాసరావు, వెస్ట్ నాయుడుపాలేనికి చెందిన ఎస్‌కె మస్తాన్‌వలి, గొర్రెపాడు గ్రామానికి చెందిన కోటేశ్వరరావులు ఫోన్‌లు పోయినట్లు ఫిర్యాదు చేయటంతో సీఐ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వాటిని బాధితులకు అందజేశారు. సహకారం అందించిన కానిస్టేబుల్ బ్రహ్మయ్యను సీఐ అభినందించారు.

పది క్వింటాళ్ల మిర్చి చోరీ

బల్లికురవ: పొలంలో ఎండబెట్టిన మిర్చి చోరీకి గురవటంతో బాధిత రైతు ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. సంతమాగులూరు మండలంలోని కొప్పరం గ్రామానికి చెందిన వల్లెపు శ్రీనుకు మండలంలోని కొప్పరపాలెం గ్రామంలో నాలుగు ఎకరాల పొలం ఉంది. ఈ పొలంలో మిర్చి సాగుచేసి పొలంలోనే పండు మిరపకాయలు ఎండబెట్టాడు. కల్లంలో ఎండబెట్టిన మిరపకాయల్లో సుమారు 10 క్వింటాళ్లు చోరీకి గురికాగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదుతో దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్

- రూ. 50 వేలు మించితే కష్టాలే
- చెక్ పోస్టుల ద్వారా ముమ్మర తనిఖీలు
- పట్టుబడుతున్న నగదు



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

వేటపాలెం: స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్ తనపని తను చేసుకుంటూ పోతోంది. ఎన్నికలు సజావుగా సాగేందుకు డబ్బు రవాణాకు చెక్ పెట్టడానికి భారీ ఎత్తున తనిఖీలు నిర్వహిస్తోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లోకి వచ్చింది. ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో పోలీసులు, ప్రత్యేక స్క్వాడ్‌లు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. నగదు, బంగారు ఆభరణాలు, మద్యం తదితరాలు పరిమితికి మించి తీసుకెళ్తే తప్పనిసరిగా లెక్క చూపించాల్సి ఉంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో తనిఖీల్లో ఆధారాలు లేని నగదు, ఇతర వస్తువులు దొరుగుతున్నాయి. రెండు రోజుల కిందట చినగంజాం టోల్ ప్లాజా దగ్గరలో కారుల తరలిస్తున్న నగదు తనిఖీ అధికారులు పట్టుకున్నారు. రాయల్ మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో లెక్కలు లేని రూ.56 లక్షలు పట్టుకున్నారు. ఎన్నికల సందర్భంగా రూ. 50 వేల వరకు మాత్రమే నగదు తీసుకెళ్లేందుకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. అంత కంటే ఎక్కువగా నగదు సామాన్యులు తరలిస్తే పూర్తిగా వివరణ ఇవ్వాలి. ఆ డబ్బు ఎక్కడ నుంచి వచ్చింది? తదితర విషయాలు చెప్పాల్సి ఉంటుంది. మీ సమాధానంలో తేడా ఉన్నా చెప్పిన దానిలో వాస్తవం లేకపోయినా ఆ నగదును అధికారులు స్వాధీనం చేసుకుంటారు. సరైన పత్రాలు చూపించాకే మీ నగదు మీకు తిరిగి అప్పగిస్తారు. అంతవరకు మీ నగదు కోర్టు కస్టడీలో ఉంటుంది. ఎన్నికల కౌంటింగ్ అయ్యేం తవరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. నగదే కాకుండా బంగారం, వెండి తదితర ఆభరణాలు, విలువైన వస్తువులు ఏమైనా సరే అనుమానం వస్తే అధికారులు స్వాధీనం చేసుకుంటారు. బంగారం వెండి తదితర వస్తువులు సైతం తగిన పత్రాలు పట్టుకుని మాత్రమే ప్రయాణాలు చేయల్సి ఉంటుంది. లేకుంటే చిక్కులు తప్పవు.

బ్యాంకు లావాదేవీలపై అప్రమత్తం..

మీకు పరిచయం లేనివారు, రాజకీయ పార్టీల ప్రతినిధులు నుంచి మీ బ్యాంకు ఖాతాలకు అధిక మొత్తంలో నగదు జమ చేసే అవకాశం ఇవ్వకూడదు. గత ఆరు నెలల్లో ఖాతాల్లో జమైన మొత్తం మించి నగదు జమకాకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఒక వేళ ఖాతాలో జమైన మొత్తాలకు సంబంధించి అధికారుల్లో అనుమానం ఉంటే ఆధారాలు చూపేందుకు సిద్ధంగా ఉండాల్సి ఉంటుంది. అవకాశం ఉన్నంత వరకు ఇతరులకు ఖాతా నంబర్లను చెప్పకపోడం మంచిది. వివాహాలు, ఇతర శుభకార్యాలు, అత్యవసర వైద్య ఖర్చులు, వ్యాపార చెల్లింపులు చేసేవారు తగిన ఆధారాలతో నగదు తీసుకువెళ్లాలి ఉంటుంది. ఆన్‌లైన్ చెల్లింపుల వివరాలు కూడా ఉంచుకోవడం ఉత్తమం అని పోలీసులు, అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వివాహాల సీజన్ కావడంతో బంగారం, వస్త్రాలు కొనుగోలు ఎక్కువగా జరుగుతుంది. అందుకు తగిన సరైన వివరాలు లేకపోతే ఇబ్బందులు తప్పవు, వీటి కొనుగోలుకు తీసుకువెళ్లే నగదు విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి, సంబంధిత దుకాణాల నుంచి బిల్లులు తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువ అపారం



యనమదలలో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ చేస్తున్న సిబ్బంది



దుద్దుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

యద్దనపూడి: ప్రజాస్వామ్యంలో ఓటు శక్తివంతమైన సాధనమని, దీని విలువ అపారమని తహశీల్దారు ఎస్. నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని యనమదల గ్రామ పంచాయతీలో ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు తమ ఓటుహక్కు ద్వారా తమకు నచ్చిన వ్యక్తిని ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు విష్ణుప్రసాద్, పోలీసు సిబ్బంది, బీఎల్‌ఓలు, కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ ఎం ప్రమీల అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని మండలంలోని దుద్దుకూరు గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల నందు గురువారం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఓటరు ప్రతి ఒక్కరూ పోలింగ్ రోజున తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టోరల్ ఆఫీసర్ ఏఈ హౌసింగ్ రామకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం నారాయణ శ్రీనివాసరావు, ఏఎస్‌ఓ జే పుష్పలత, వీఆర్వో శేష తల్పసాయి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



గుంటుపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు



అద్దంకి: పోలీసు కవాతులో పాల్గొన్న సీఐ, ఎస్సై, కేంద్ర బలగాలు

బల్లికురవ: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరూ స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సంతమాగులూరు సీఐ కె. నరసింహారావు కోరారు. గురువారం సాయంత్రం మండలంలోని గుంటుపల్లి కొత్తపాలెం గ్రామాల్లో కేంద్ర బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. గ్రామాల్లో అల్లర్లు, అలజడులు, వివాదాలు సృష్టిస్తే ఉక్కుపాదంతో అణచి వేస్తామని, ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు రాజకీయ పార్టీలు, ఓటర్లు సహకరించాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు ఒకరికొకరు ఐక్యతతో జీవించాలని చిన్నచిన్న విషయాలు సైతం పెద్దవి చేసుకుని పోలీసు స్టేషన్, కేసులు కోర్టులకు ఎక్కటంల్ల ఎంతో విలువైన సమయం డబ్బు వృథా అవుతుందని సీఐ వివరించారు. కార్యక్రమంలో కేంద్ర మిలటరీ బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

4 గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు

అద్దంకి రూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని అద్దంకి సీఐ పీ. కృష్ణయ్య అన్నారు. గురువారం మండలంలోని మైలవరం, ఉప్పలపాడు, వెంపరాల, చక్రాయపాలెం గ్రామాల్లో కేంద్ర బలగాలు స్థానిక పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరు నిర్భయంగా ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రతి బూత్‌లోను పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఎన్నికల నిర్వహణలో అలసత్వం తగదు



ఓటర్ల చైతన్య సభలో మాట్లాడుతున్న ఆర్‌ఓ రవీందర్



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో వరప్రసాద్

చినగంజాం: ఎన్నికల కోడ్ అమలు చేసే విషయంలో సిబ్బంది బాధ్యాయుతంగా పనిచేయాలని ఎంపీడీఓ యూబీ వరప్రసాద్ సూచించారు. మండలంలోని సంతరావూరు, గొనసపూడి గ్రామాలల్లో ఆయన సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. సిబ్బంది మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఎన్నికల కమీషన్ నియమావళి ప్రకారం పాటించాలని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. అనంతరం ఆయన సంతరావూరు, సోపిరాల, చినగంజాం, గొనసపూడి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను సందర్శించి పరిశీలించారు.

➤ ప్రతి ఒక్కరూ ఓటు వేయడాన్ని ఒక బాధ్యతగా భావించాలని పర్చూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, బాపట్ల ఆర్డీవో జీ రవీందర్ అన్నారు. మండలంలోని నాగులపాలెం గ్రామంలో గురువారం ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఓటరు చైతన్యవంతులై ఓటు వేయాలని, ఎవ్వరూ కూడా ఓటు వేయకుండా ఉండరాదని, ఓటు వేయడం ఒక బాధ్యత అని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, స్వీప్ అధికారులు ప్రిన్సిపాల్ చింపారెడ్డి, ఈఓపీఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఆర్‌ఐ, అధియాచకలక ఓటర్లు భారీగా తదితరులు పాల్గొన్నారు.

31న ఈస్టర్ ఆధ్యాత్మిక నాటిక

చీరాల రూరల్: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో గ్లోబల్ క్రిస్టియన్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ సహకారంతో ఈనెల 31 రాత్రి 7 గంటలకు ఈస్టర్ కంటాట అను గొప్ప ఆధ్యాత్మిక నాటిక నిర్వహించనున్నట్లు చర్చి పాస్టర్లు రెవరెండ్ కొమ్మిన జోసఫ్ కేరి, రెవరెండ్ పిల్లి దేవదాసు, చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆనాటి కాలంలో ప్రభువైన ఏసు క్రీస్తు పొందిన శ్రమలు, సిలువ మరణం, ఆనాటి వస్త్రధారణ, పునరుద్ధాన వంటి దృశ్యాలను మన కళ్లకు కట్టినట్లు ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ ఆధ్యాత్మిక నాటికలో 80 మంది ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కళాకారులతో అద్భుతమైన భారీ సెట్టింగులతో మిరుమిట్లు గొలిపే కాంతులతో ఈస్టర్ కంటాట నాటిక ప్రదర్శిచబడునని వారు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో క్రైస్తవులు వీక్షించి క్రీస్తు దీవెనలు అందుకోవాలని వారు కోరారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయనం, ఫాల్గుణమాసం, విశాఖ నక్షత్రం, చవితి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నిందితుడు కోర్టులో హాజరు

బల్లికురవ: యువతికి తరచూ ఫోన్‌చేస్తూ అసభ్యకరంగా మాట్లాడుతూ ఇంట్లోకి ప్రవేశించి దాడిచేసిన నిందితుడిని గురువారం బల్లికురవ ఇన్‌చార్జి ఎస్సై సురేష్ అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచారు. పోలీసుల వివరాల మేరకు.. కొప్పరపాలెం గ్రామానికి చెందిని వివాహితురాలికి ఇదే గ్రామానికి చెందిన వల్లెపు నాగేశ్వరరావు తరచూ ఫోన్‌చేస్తూ అసభ్యకరంగా మాట్లాడుతున్నాడు. ఈనెల 24న రాత్రి యువతి ఇంట్లోకి చొరబడి కత్తితో దాడి చేయటంతో కంటికి తీవ్ర గాయమైంది. క్షతగాత్రురాలుని భర్త, స్థానికులు చికిత్సకై ఒంగోలు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 26వ తేదీ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదుతో దర్యాప్తులో భాగంగా నాగేశ్వరరావును అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై వివరించారు.

బ్యాంకు లావాదేవీలపై అప్రమత్తత అసవరం



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఆర్వో రవీందర్

పర్చూరు (చినగంజాం): బ్యాంకు అధికారులు ఎన్నికల నిర్వాహణలో సహకారం అందించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జీ రవీందర్ అన్నారు. గురువారం పర్చూరు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో ఉండే బ్యాంకు సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో ఉండే బ్యాంకు సిబ్బందికి మైక్రో అబ్జర్వర్లుగా విధులు కేటాయించే అవకాశం ఉందన్నారు. విధులు నిర్వహించే అధికారులు విధులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఆరు మండలాల పరిధిలో 40 బ్యాంకులు ఉన్నాయని, ఆ సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయిస్తారని చెప్పారు. వారంతా మైక్రో అబ్జర్వర్లకు ఇచ్చే చెక్‌లిస్ట్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు సీహెచ్ సుబ్బయ్య,కే సంధ్యశ్రీ, మెహర్‌బాబు పాల్గొన్నారు.

80 మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లను ప్రదర్శిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

మార్టూరు: అక్రమంగా మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్‌వీ రాజశేఖర్‌రెడ్డి గురువారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన కొప్పరపు బాలకృష్ణ అక్రమ మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నాడనే ముందస్తు సమాచారంతో సీఐ తమ సిబ్బందితో గురువారం మధ్యాహ్నం స్థానిక కొణిదెన రోడ్డులో నిఘా పెట్టారు. అందులో భాగంగా బాలకృష్ణ తన హీరో హోండా యాక్టీవా స్కూటీపై అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్ల గోతామును స్వాధీనం చేసుకుని పరిశీలించారు. గోతాములో వివిధ పరిమాణాలు గల 80 మద్యం బాటిళ్లను గుర్తించిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బాలకృష్ణపై కేసు నమోదు చేసి, వాహనాన్ని బాలకృష్ణను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌ఐలు సైదా, మెహబూబ్ భాషా, కానిస్టేబుళ్లు గరుత్మంతుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేసిన ఎమ్మెల్యే కరణం బలరాం, అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్

- ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కరణం, అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్

వేటపాలెం: మండల పరిధిలోని పాపాయిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవస్థానంలో పోలేరమ్మ తల్లి, అభయాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా గురువారం పండితులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్ హాజరై స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం భారీగా అన్న సంతర్పన చేశారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, మండల ఇంచార్జి బుర్ల సాంబశివరావు, పులి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పులి వెంకటేశ్వర్లు, పులి హరికృష్ణ, గవిని రమేష్, గవిని వెంకట్రావు, పులి బుజ్జి, గవిని వేణు పాల్గొన్నారు.

వైద్యుల గౌరవం పెంచిన డాక్టర్ ప్రసాద్

- ఎమ్మెల్యే కరణం, అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్



డాక్టర్ ప్రసాద్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్

చీరాల అర్బన్: ఉన్నత వ్యక్తిత్వం, సేవాగుణంతో డాక్టర్ పోలవరపు వెంకటేశ్వర ప్రసాద్ సమాజంలో వైద్యుల గౌరవం పెంచారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. గురువారం కొత్తపేటలోని రావి జయలక్ష్మి సుబ్బారాయుడు కళ్యాణ మండపంలో డాక్టర్ పోలవరపు వెంకటేశ్వరప్రసాద్ సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ డాక్టర్ వెంకటేశ్వరప్రసాద్ తండ్రి జగదీశ్వరరావు విద్యారంగానికి, ఆయన కుమారుడు డాక్టర్ వెంకటేశ్వరప్రసాద్ వైద్యరంగానికి ఎనలేని సేవలందించారన్నారు. అలానే పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించారన్నారు. చైతన్యభారతి అనే సాంస్కృతిక వేదికకు అధ్యక్షులుగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వైద్యులు డాక్టర్ జేవీ సుబ్బారావు, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ ప్రేమ్‌చంద్, డాక్టర్ కె. వీరశంకరరావు, చైతన్యభారతి కార్యదర్శి భాగి నారాయణ శాస్త్రి, కళాంజలి కార్యదర్శి సాంబశివరావు, బి.బ్రహ్మారెడ్డి, జంపాల గంగాధరరావు, ప్రొఫెసర్ జంపాల రాజేష్, జంపాల ఆదిలక్ష్మి, కరణం శ్రీనివాసబాబు, రోటరీ మాజీ గవర్నర్ జీవి రామారావు, ఎ.నాగవీరభద్రాచారి, పోలవరపు జనార్దనరావు, మల్లిఖార్జున ప్రసాద్, డాక్టర్ జగదీష్, బీరం సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాలు కల్తీకి పాల్పడితే చర్యలు



సర్టిఫికెట్లు అందుకున్న వ్యాపారులతో అధికారులు

వేటపాలెం: నిత్యావసర సరుకులు, ఆహార పదార్థాల్లో కల్తీకి పాల్పడిన వారిపై కటిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రణీత్ కుమార్ హెచ్చరించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఆహార భద్రతపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి మాట్లాడుతూ వినాయోగదారులకు కల్తీలేని సరుకులు, ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు. కల్తీకి పాల్పడినట్లు రుజువైతే కటిన చర్యలతో పాటు భారీ స్థాయిలో జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. కల్తీ ఆహారం తిని ప్రాణహాని జరిగితే దానికి బాధ్యుడైన వ్యాపారి బాధితుడికి రూ.10 లక్షల జరిమానా కింద చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆహార పదార్థాల విక్రయాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వ్యాపారులకు శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎక్జిక్యూటివ్ అధికారి కే సురేంద్ర, వ్యాపారులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఉచిత ఉపకరణాలు



మాట్లాడుతున్న జిల్లా సమన్వయకర్త జ్యోత్స్న

అద్దంకి: వైద్య శిబిరంలో పరీక్షలు చేసి గుర్తించిన వారిలో అవసరమైన వారికి ఉచిత ఉపకరణాలు పంపిణీ చేస్తామని సహిత విద్య జిల్లా సమన్వయకర్త మాట్టా జ్యోత్స్న అన్నారు. పట్టణంలోని సత్రబండి పాఠశాలలో రాష్ట్ర సమగ్రశిక్ష కార్యాలయం ఆదేశాల మేరకు గురువారం ప్రత్యేకావసరాల పిల్లలకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఇందులో 201 మందికి ఉపకరణాలు అందుకోవడానికి అర్హులుగా వైద్యులు గుర్తించారని చెప్పారు. వారికి త్వరలోనే ఉపకరణనాలు పంపిణీ చేస్తామన్నారు. శిబిరంలో ఆడియాలజిస్ట్ ఎన్ నివేదిత, ఆప్టోమేట్రిస్ట్ టీ నాగకోటేశ్వరరావు, ఫిజియోథెరపిస్ట్ కే చతన్య, ఇందిరా ప్రియదర్శిని వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంఈవో గంగాధర్‌రావు, బీ సుధాకర్‌రావు అధ్యక్షత వహించగా కార్యక్రమాన్ని హెచ్‌ఎం ఇట్టా రామారావు, ఐఈఆర్‌టీలు యేనా, కొంగల శ్రీనివాస్, రమణారెడ్డి, బాబురావు, గంగాధర్, కొండయ్య, ఫిలిఫ్‌రెడ్డి, ఐఈఆర్‌టీలు ఆయాలు పర్యవేక్షించారు.

వాహనాల తనిఖీ

చీరాల అర్బన్: ఎన్నికల నేపథ్యంలో ఈపూరుపాలెం రూరల్ పోలీసులు ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల సందర్భంగా వాహనాల్లో నగదు, మద్యం వంటివి అక్రమంగా తరలించకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. రాకపోకలు సాగించే వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. నగదు తీసుకెళ్లే వారు అందుకు సంబంధించిన సరైన పత్రాలు వెంట తీసుకెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు.